# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, బుధవారం 12 మార్చి 2025 | VIKARABAD


## ఇంటికి అరిష్టం పట్టిందని గుడిలోని దేవుడ్ని ఎత్తుకెళ్లారు..

వెంగళరావునగర్, మార్చి 11 : ఇంటికి అరిష్టం పట్టిందని గుడిలోని శివపార్వతుల పంచలోహ విగ్రహాలను తస్కరించి ఇద్దరు మహిళలు ఇంటికి తెచ్చుకున్నారు. ఈ ఘటన ఎస్.ఆర్.నగర్ ఠాణా పరిధిలో జరిగింది. బంజారాహిల్స్ ఎన్‌బీటీనగర్‌కు చెందిన స్వర్ణలత(29), తన సోదరి పావని(26)కలిసి ఉంటున్నారు. స్వర్ణలత ఇంట్లో రెండేండ్లలో వరుసగా తల్లిదండ్రులతోపాటు ఇద్దరు సోదరులు మరణించారు. దీంతో తన ఇంటికి కీడు పట్టిందని..అది తొలగాలంటే నిత్యం పూజలందుకునే ఆది దంపతుల విగ్రహాలను గుడిలో నుంచి కాజేసి ఇంటికి తెచ్చుకుంటే సకల శుభాలు కలుగుతాయని భావించింది. ఈ నెల 8న ఎస్ఆర్‌నగర్ సమీపంలోని గురుమూర్తినగర్‌లోని వినాయక టెంపుల్‌కు సోదరితో కలిసి వెళ్లింది. అక్కడ అర్చకుడు నవీన్‌కుమార్ ప్రసాదాలు పంచి పెడుతుండగా ఇదే అదునుగా శివపార్వతుల పంచలోహ విగ్రహాలను కాజేసింది. గమనించిన అర్చకుడు ఆలయ ఈవో నరేందర్‌రెడ్డికి చెప్పగా..ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు స్వర్ణలత, పావనిలే చోరీకి పాల్పడినట్లు తేల్చి పంచలోహ విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్ఆర్‌నగర్ ఠాణాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వెంకటరమణ, ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డీఐ గోపాల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.









మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఎస్ఆర్‌ఎల్పీ సమావేశంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు వాణీదేవి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేటి నుంచి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ అధినేత వారికి దిశానిర్దేశం చేశారు.



## ఏడాదిగా ఒక్క రూపాయీ రాలేదు..



పరిగి, మార్చి 11 : ఏడాది నుంచి రైతుభరోసా పెట్టుబడి సాయం ఒక్క రూపాయీ రాలేదు. తండ్రి హన్మయ్య పేరిట ఉన్న భూమిని మా అమ్మ మల్లమ్మ పేరిట ఎకరం, నా పేరిట 2.37 ఎకరాల చొప్పున పట్టా చేసుకుని ఏడాది దాటింది. అప్పటి నుంచి రైతుభరోసా కోసం రెండుసార్లు వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకున్నా. ప్రస్తుతం మొక్కజొన్న, కొత్తిమీర, కుసుమ పంటలు సాగు చేశా. ఇటీవలే పత్తి పంట కూడా పూర్తైంది. రెండు రోజుల కిందట తనకు ఇంకా పెట్టుబడి సాయం రాలేదని వ్యవసాయాధికారిని కలిసి అడిగితే త్వరలో వస్తుందని చెప్పారు. రేవంత్ సర్కార్ రైతు భరోసా కింద రైతులందరికీ పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేస్తున్నట్లు చెబుతున్నా.. ఇంకా రాలేదు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతుబంధు సమయానికి బ్యాంకు ఖాతాలో జమయ్యేది. అప్పట్లో పంటల సాగుకు, విత్తనాల కొనుగోలు, కూలీల ఖర్చుల కు ఆ డబ్బు ఎంతో ఉపయోగపడింది. కానీ, ప్రస్తుతం పంటల సాగుకు అప్పులు చేయాల్సిన దు స్థితి వచ్చింది. వ్యవసాయం చేస్తూ పంటలు పండిస్తున్న భూములకే రైతు భరోసా రాకుంటే ఎవరినీ అడగాలి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే రైతుభరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించాలి.

**-మొరంగపల్లి జంగయ్య, నస్కల్**

# పంట మేతకు.. అప్పులు రైతుకు..

## కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి అయోమయం...

- నీళ్ల కొరతతో సాగని సాగు..
- రైతుభరోసా సాయం అందక భారమైన అప్పులు
- మెతుకుల కోసం వరి వేస్తే ఎండిపోయి పశువుల మేతకు వదలాల్సిన దుస్థితి
- వికారాబాద్ జిల్లాలో 5000 ఎకరాలపైనే ఎండుముఖం పట్టినట్లు అంచనా
- ఈనెలాఖరు వరకు మరింత పెరిగే అవకాశం
- రోజురోజుకూ తగ్గుతున్న బోర్లలో నీటినిల్వల శాతం
- ఏప్రిల్ నెలలో బోర్లలో నీటి నిల్వలు తగ్గితే సాగైన వరిలో 70 శాతానికిపైగా నష్టపోనున్న రైతులు !
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి



పెద్దేముల్ మండలంలోని జనగాం గ్రామంలో నెర్రెలు తేలిన వరి పంట


**గతంలో ఎన్నడూలేని విధంగా వికారాబాద్ జిల్లాలో భూగర్భజలాలు తగ్గడంతో భూములు నెర్రెలు తేలి ఎండుముఖం పట్టాయి. అప్పులు తెచ్చి సాగు చేసిన పంట ఎండుతుండడంతో అన్నదాత పుట్టెడు దుఃఖంలో ఉన్నాడు. జిల్లాలో ఇప్పటివరకు దాదాపుగా 5,000 ఎకరాల వరకు వరి ఎండుముఖం పట్టినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా కులకచర్ల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఎండిన పంటను అన్నదాతలు మేతకు వదిలేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.**

వికారాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ): యాసంగి కాలం జిల్లా రైతాంగానికి కష్టకాలమైపోయింది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట నష్టాలనే మిగిల్చేలా ఉన్నది. అప్పులు తెచ్చి సాగు చేసిన పంట ఎండుముఖం పట్టడంతో పుట్టెడు దుఃఖంలో ఉన్నారు అన్నదాతలు. గతంలో ఎన్నడూలేని విధంగా భూగర్భజలాలు తగ్గడంతో ఎండుముఖం పట్టింది. భూములు నీరులేక నెర్రెలు తేలిన దయనీయ పరిస్థితి నెలకొన్నది. అయితే, జిల్లాలో ఇప్పటివరకు దాదాపుగా 5,000 ఎకరాల వరకు వరి ఎండుముఖం పట్టినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

అత్యధికంగా కులకచర్ల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో ఎండినట్లు అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ మాసంలో బోర్లలో నీటి నిల్వల శాతం తగ్గిపోతే జిల్లాలో సాగు చేసిన వరి పంటలో 70 శాతానికిపైగా ఎండిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే ఎండల తీవ్రత అధికమైన దృష్ట్యా ఏప్రిల్‌లో మరింత ఎండలు ముదరనున్న నేపథ్యంలో భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే పరిస్థితి నెలకొన్నది. ప్రస్తుతం ఎండ తీవ్రత 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుండగా, ఏప్రిల్‌లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతకు మించి నమోదయ్యే అవకాశాలున్నాయని.. ఈ దృష్ట్యా వరి పంటపై నీలినీడలు కమ్ముకున్నట్లేనని తెలుస్తున్నది. మరోవైపు ఎండుముఖం పట్టిన వరి పంటను కొందరు రైతులు పశువులకు మేత కోసం వదులుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

### 90,814 ఎకరాల్లో వరి సాగు..

జిల్లాలో యాసంగిలో 90,814 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. అత్యధికంగా దౌల్తాబాద్ మండలంలో 14,449 ఎకరాలు, దోమ మండలంలో 12,120, యాలాలలో 10,850, బొంరాస్‌పేటలో 9650, కొడంగల్‌లో 5162, కులకచర్లలో 5450, పరిగిలో 5487, తాండూరులో 4215, ధారూరులో 4623, బషీరాబాద్‌లో 3980, పెద్దేముల్‌లో 3395, దుద్యాలలో 8688, మోమిన్‌పేటలో 468, కోట్‌పల్లిలో 61, మర్పల్లిలో 25, నవాబుపేటలో 95, వికారాబాద్‌లో 156, పూడూరులో 90, చౌడాపూర్ మండలంలో 1850 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. అయితే,ఈ సాగైన పంటలో సుమారు 5,000 ఎకరాల వరకు ఎండుముఖం పట్టినట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితిని చూస్తే అర్థమవు తున్నది. జిల్లాలో మెజార్టీ భాగం బోర్లపైనే ఆధారపడి సాగు చేయగా.. ఏప్రిల్ రెండో వారం వరకు బోర్లలో నీటి నిల్వలు తగ్గకుంటే పంట చేతికొచ్చే అవకాశాలున్నాయి.. లేదంటే సాగు చేసిన దానిలో 70 శాతానికిపైగా నష్టపోనున్నారు.



వితలాపూర్ గ్రామంలో ఎండిన వరి పంట

### ప్రభుత్వం ఆదుకోవాలి



నేను మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. బోరు నుంచి నీరు రాకపోవడంతో పంట ఎండిపోతున్నది. ప్రభుత్వం స్పం దించి కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి నీటిని వదిలి ఆదుకోవాలి.

**-సుక్క చంద్రయ్య, జనగాం, పెద్దేముల్**

### పశువుల మేతకే..

వేసిన పంటలు ఎండిపోతున్నాయి. తాను ఎకరం పొలంలో వరిని సాగు చేశా. ఉన్న ఒక్క బోరు నుంచి నీరు రాకపోవడం తో ఎకరం పొలం ఎండి పోతుంది. ఇక ఆ పంట పశువుల మేతకే వాదాల్సి న దుస్థితి నెలకొన్నది. పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు.

**-గోపాల్‌రెడ్డి, రైతు పుట్టపహాడ్ గ్రామం, కులకచర్ల**



## అడుగంటుతున్న భూగర్భ జలాలు

బీఆర్ఎస్ హయాంలో చెరువుల పూడికతీత పనులతో తటాకాల్లో నీటి నిల్వలు సమృద్ధిగా ఉండడంతో భూగర్భజలాలకు ఎలాంటి ప్రమాదం లేకుండే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా నట్టేట ముంచిన రేవంత్ ప్రభుత్వం చెరువుల పూడికతీత పనులను గాలికి వదిలేసింది. దీంతో జిల్లాలోని ప్రధాన ప్రాజెక్టులతోపాటు మెజార్టీ చెరువుల్లో రోజురోజుకూ నీటి నిల్వలు తగ్గిపోతున్నాయి. ఎండల తీవ్రత పెరిగిన దృష్ట్యా ఈనెలాఖరు నాటికి ప్రాజెక్టులతోపాటు చెరువుల్లోనూ 50 శాతానికిపైగా నీటి నిల్వలు తగ్గే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, జిల్లాలో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోతున్నాయి. ఫిబ్రవరి చివరి నాటికి 13.58 మీటర్ల లోతుకు అడుగంటిపోయాయి. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటికి .37 మీటర్ల మేర నీటి నిల్వలు తగ్గాయి. అయితే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరీ దారుణంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వికారాబాద్ మండలంలోని మైలార్‌దేవ్‌పల్లిలో 42.98 మీటర్లకు, దు ద్యాల మండలంలో సగటున 29.88 మీటర్లు, మర్పల్లి మండలంలో 22.39 మీటర్ల లోతుకు, మర్పల్లి మండలంలోని నర్సాపూర్‌లో 32.56 మీటర్లకు, నవాబ్‌పేట మండలంలోని మాదిరెడ్డిపల్లిలో 21.28 మీటర్లకు, దోమ మండలంలోని దిర్సంపల్లిలో 17.25 మీటర్లకు, దోమ లో 14.25 మీటర్లకు, యాలాల మండలంలోని దేవనూర్‌లో 28.98 మీటర్లకు, ధారూరు మండలంలోని అంతారంలో 16.42 మీటర్లకు, కో ట్‌పల్లిలో 14.56 మీటర్లకు, కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్‌లో 15.32 మీటర్లకు, పరిగి మండలంలోని రంగంపల్లిలో 42.35 మీటర్లకు, తాండూరు మండలంలోని ఉద్దండాపూర్‌లో 29.42 మీటర్లకు, జిన్‌గుర్తిలో 19.48 మీటర్లకు, కొడంగల్ మండలంలోని రుద్రారంలో 15.46 మీటర్లకు భూగర్భజలాలు చేరాయి.

### అప్పులు తెచ్చి.. పంటల సాగు..



భూగర్భజలాలు పూర్తిగా తగ్గిపోయాయి. వరి నీరు అందక ఎండిపో తున్నది. అప్పులు చేసి పంటను సాగు చేశా. రైతు భరోసా కూడా రాక పోవడంతో ఇబ్బందిగా ఉన్నది. ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించి ఆదుకోవాలి. **-వెంకటయ్య, రైతు చెల్లాపూర్, కులకచర్ల**

# హామీ లేని ఉపాధి



- తమకూ పని కల్పించాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు
- ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీతో లింకు పెట్టడంతో పెరిగిన అప్లికేషన్లు

**రంగారెడ్డి జిల్లాలో జాబ్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు 63,318**

రంగారెడ్డి, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కరువు నేపథ్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని నిరుపేదలు కోరుతున్నారు. అందుకోసం జాబ్‌కార్డుల కోసం అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 63,318 మంది తమకూ కార్డులు ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పట్టణీకరణతో గ్రామాలు మున్సిపాలిటీలుగా మారడం.. నీరు లేక పంటలు పండని పరిస్థితి నెలకొన్నడం.. పనులు చేసుకుందామంటే ప్రభుత్వం కొత్తగా ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రావాలంటే ఉపాధిహామీలో జాబ్ కార్డు కలిగి ఉండి కనీసం 20 రోజులు పనిచేసిన వారికి మాత్రమే ఇస్తామని మెలిక పెట్టడంతో ఈ పథకంలో చేరేందుకు ప్రజలు, కూలీలు, నిరుపేదలు ఎక్కువగా ముందుకొస్తుండడంతో అధికారులు జాబ్‌కార్డుల జారీని నిలిపేశారు. జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపేయగా.. 21 గ్రామీణ మండలాల్లో మాత్రం యథావిధిగా కొనసాగుతున్నది. ప్రస్తుత పరిస్థితిలో భూమి లేని పేదలకు సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకమే దిక్కైంది.

### జిల్లాలో 1,60,000 జాబ్ కార్డులు..

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న 1,60,000 మందికి అధికారులు జాబ్‌కార్డులు అందించారు. ఈ కార్డులు పొందిన కుటుంబాల్లోని సుమారు 2,61,000 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఈ పథకం కింద జనవరి నుంచి జూన్ నెల వరకు కూలీలకు పనులు కల్పించాల్సి ఉంటుంది. కాగా, జాబ్‌కార్డులు లేనివారు 63,318 మంది తమకూ కార్డులు ఇవ్వాలని దరఖాస్తు చేసుకోగా.. ఇటీవల 1800 మందికి మాత్రమే ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన వారు తమకెప్పుడు ఇస్తారని అధికారులను అడుగుతున్నారు.

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీతో లింకు..

అసెంబ్లీ ఎన్నికల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకటించారు. కాగా, పవర్‌లోకి వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ ఉపాధి హామీ జాబ్‌కార్డులు కలిగి ఉండి కనీసం 20 రోజులు పనిచేసిన వారే ఈ పథకానికి అర్హులని లింకుపెట్టింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీ పనులు చేసుకునే నిరుపేదలు జాబ్‌కార్డులు తీసుకునేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతుండడంతో అధికారులు వాటి జారీని నిలిపేశారు.

### అర్హులందరికీ జాబ్ కార్డులివ్వాలి



జిల్లాలో కరువు నేపథ్యంలో గ్రా మీణ ప్రాంతాల కూలీలకు పను లు దొరకని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో అర్హులైన వా రందరినీ చేర్చుకుని పనులు కల్పించాలి. అలాగే, దరఖాస్తు లు చేసుకున్న వారికి జాబ్‌కార్డులు ఇవ్వాలి.

**-బోడ సామెల్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు**

### నిరుపేదలకు పని దొరకడం లేదు



జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులకు పని దొరకని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఉపాధి హామీ కింద గ్రామీణ కూలీలకు పనిని కల్పించాలి. దరఖాస్తు చేసుకున్న వారందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలి.

**-పల్నాటి యాదగిరి**

## అతివేగంగా నడిపి.. స్తంభాన్ని ఢీకొట్టి ..

- రోడ్డు ప్రమాదంలో ఎంజీఐటీ విద్యార్థి దుర్మరణం
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

మణికొండ మార్చి 11 : అతివేగంగా వాహనాన్ని నడుపుతూ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టి ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. ఈ విషాద ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గండిపేటలోని ఎంజీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు స్విఫ్ట్ కారులో మంగళవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి బయలు దేరారు. నియో పోలీస్ సమీపంలోకి రాగానే వేగంగా వెళ్లి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకర్ (18) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మిగిలిన ఐదుగురిలో హేమసాయి(19), వివేక్ (19), సృజన (18), కార్తికేయ(18), హర్ష (19)కి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో హర్షసాయి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను స్థానిక వైద్యశాలలో చేర్పించిన పోలీసులు శ్రీకర్ మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నుజ్జునుజ్జయిన కారు